

టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టం రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.45

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.45, కనిష్టంగా రూ.27 పలికింది. మార్కెట్‌కు 1,650 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.9°/22.8°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జైలును పాఠశాలగా భావించండి

- తప్పులు తెలుసుకుని మారండి
- ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సూచన



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

కదిరి టౌన్: 'జైలును పాఠశాలగా భావించండి. తప్పులను సరిదిద్దుకుని భావి జీవితాన్ని అందంగా మలచుకోండి' అని ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ ఖైదీలకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక సబ్‌జైలులో ఉన్న ఖైదీల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, సబ్‌జైలును ఒక పాఠశాలగా భావించి మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవాలని ఖైదీలకు సూచించారు. అనంతరం ఖైదీల యోగక్షేమాలపై ఆరా తీశారు. ఖైదీల ఆరోగ్యం, భోజన సదుపాయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఆయన ఖైదీలకు ఇస్తున్న సరుకులు, కూరగాయలను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, కె.నరసింహులు, సిరాజుద్దీన్, సబ్ జైలర్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రశాంతి నిలయం: దీపావళి సందర్భంగా జిల్లాలో టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వారు తాత్కాలిక లెసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌ఓ కొండయ్య బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 5తేదీ వరకు కలెక్టరేట్‌లోని మెజిస్టీరియల్ సెక్షన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేవారు దరఖాస్తుతో పాటు, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రూ.500 చలానా జత చేయాలన్నారు. ఇలా అందిన దరఖాస్తులన్నీ పరిశీలించి రెవెన్యూ, పోలీస్ అధికారుల విచారణ అనంతరం జీఎస్టీ, ఫైర్ చలానా, ఎన్‌ఓసీ సమర్పించిన వారికి మాత్రమే లైసెన్స్ మంజూరు చేస్తామన్నారు.

పలు మండలాలో వర్షం

ప్రశాంతి నిలయం: అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. మొత్తంగా 379 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కదిరిలో 32.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక సోమందేపల్లి మండలంలో 32.2 మి.మీ, ఓడీసీ 31.4, బుక్కపట్నం 29.6, గోరంట్ల 25.8, కొత్తచెరువు 22.0, అమడగూరు 18.4, గాండ్లపెంట 18.2, నల్లమాడ 17.4, పుట్టపర్తి 17.4, అమరాపురం 17.2, రొద్దం 16.4, తలుపుల 16.2, ఎన్పీకుంట 15.0, రొళ్ల 11.4, తనకల్లు 10.6, పెనుకొండ 10.0, చిలమత్తూరు 8.6, నల్లచెరువు 7.4, పరిగి 7.2, ముదిగుబ్బ 6.6, మడకశిర 3.6, హిందూపురం 2.0, ధర్మవరంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

కబ్జాల ఖల్‌నాయక్



శ్రీరామ్‌నాయక్

రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్లు అడ్డగోలుగా సంపాదించేందుకు అడ్డదారులు వెతుకుతున్నారు. కొందరు సహజ సంపదను కొల్లగొడుతుండగా.. మరికొందరు 'ప్రభుత్వం మాదే.. ప్రభుత్వ స్థలాలూ మావే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఖాళీ స్థలం కనబడితే కబ్జా చేస్తున్నారు. ఇందుకోసం అధికారుల సంతకాలనూ ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఈ దందా జోరుగా సాగుతోంది.

- పుట్టపర్తిలో 'తమ్ముడి' దాదాగిరి
- ఫోర్జరీ సంతకాలు.. నకిలీ పట్టాలు
- అధికారులనే బురిడీ కొట్టిస్తున్న వైనం
- ప్రభుత్వ భూములన్నీ తన గుప్పిట్లోనే..
- నిత్యం వివాదాల్లో పెడపల్లి శ్రీరామ్‌నాయక్
- మాజీ మంత్రి 'పల్లె' అండ చూసుకుని వీరంగం



పెడపల్లిలో లేఅవుట్‌కు వెళ్లే దారి స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ఇల్లు



పెడపల్లిలో శ్రీరామ్‌నాయక్ నివాసం (ప్రహరీలో కలిసిపోయిన వాటర్ ట్యాంక్ స్థలం)

సాక్షి, టాస్క్‌ఫోర్స్

పుట్టపర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములపై పెడపల్లి గ్రామ పంచాయతీ పెద్ద తండాకు చెందిన వి.శ్రీరామ్‌నాయక్ కన్నేశాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుంచే ఆక్రమణల పర్వం ప్రారంభించాడు. దొంగ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి.. వాటిని దర్జాగా విక్రయించి డబ్బులు పోగు చేసుకుంటున్నాడు. తోపు పోరంబోకు, డిజిటల్ లైబ్రరీ, ఈద్గా స్థలం, కర్మకాండలకు కేటాయించిన ప్రాంతం.. ఇలా ప్రభుత్వ భూములన్నీ ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుని జేసీబీలతో చదును చేయిస్తున్నాడు. సెంట్ల లెక్కన రూ.లక్షలకు అమ్మేస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నాడు. నిర్మాణాలు ఆపాలని అధికారులు నోటీసులు జారీ చేసినా.. బేఖాతరు చేస్తున్నాడు. చివరకు రోడ్లకు కేటాయించిన స్థలాన్నీ కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తున్నాడు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అండతోనే శ్రీరామ్‌నాయక్ దందాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

మగాడు ఎవడైనా రావొచ్చంటూ సవాల్..

రెవెన్యూ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలు సృష్టిస్తున్న శ్రీరామ్ నాయక్... ప్రభుత్వ భూములను దర్జాగా విక్రయిస్తున్నాడు. తమ పార్టీ (టీడీపీ) అధికారంలోకి వచ్చిందని.. అడ్డొచ్చిన వాడిని తాట తీస్తానంటూ బెదరింపులకు దిగుతున్నాడు. ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే 'మగాడు ఎవడైనా ఉంటే... వచ్చి ఢీకొనవచ్చు' అంటూ సవాల్ విసురుతున్నాడు.

దందాల్లో కొన్ని ..

- పుట్టపర్తి మండలం పెడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 564–4 సర్వే నంబరులో 12 సెంట్లు తోపు పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అయితే ఆ భూమిని శ్రీరామ్‌నాయక్ ఆక్రమించాడు. భవన నిర్మాణాలు చేపట్టాడు. నిర్మాణం ఆపాలని అధికారులు నోటీసులు పంపినా ఖాతరు చేయలేదు.
- పెడపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబరు 139లో ఉన్న ఈద్గా.. ఎన్‌హెచ్ 342 నిర్మాణంలో పోతోంది. గ్రామస్తుల కోరిక మేరకు పంచాయతీ తీర్మానం ప్రకారం ఈద్గా కోసం సర్వే నంబరు 139–1లో 56 సెంట్లు కేటాయించారు. ఆ స్థలాన్ని ఆక్రమించిన శ్రీరామ్ నాయక్ జేసీబీలతో చదును చేయించి సెంటు రూ.4 లక్షలు చొప్పున విక్రయిస్తున్నాడు
- పెడపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబరు 157–1, 157–2లో ఉన్న 8 సెంట్ల స్థలాన్ని గత ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ కోసం కేటాయించింది. అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భూమిపూజ చేశారు. అయితే ఆ స్థలానికి దొంగ పట్టాలు సృష్టించి.. సెంటు రూ.5 లక్షలు చొప్పున అమ్మేశాడు.
- పెడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబరు 148–2లో ఉన్న 17 సెంట్లను షెడ్యూల్డ్ తెగల కులాల వారు కర్మకాండలు చేసుకునేందుకు కేటాయించారు. ఆ స్థలాన్ని శ్రీరామ్ నాయక్ ఆక్రమించి జేసీబీలతో చదును చేయిస్తున్నాడు. అడ్డొచ్చిన వారి తోలు తీస్తాన ంటూ బెదిరిస్తున్నాడు.
- పెడపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు 148–1లో ఉన్న లేఅవుట్‌కు వెళ్లేందుకు 30 అడుగుల రోడ్డును వదిలారు. అందులో ఐదు అడుగుల వరకు కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఎవరు చెప్పినా.. వినేది లేదంటున్నాడని స్థానికులు వాపోతున్నారు.

ఆరోపణలు.. వీరిపైనే

పెడపల్లిలో దొంగపట్టాలు సృష్టించి రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసేందుకు కొందరు ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది. వారు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించాక వాటితో రంగంలోకి దిగి కబ్జా చేయడంలో శ్రీరామ్ నాయక్ పేరు ఏ–1గా వినిపిస్తోంది. ఆయన తమ్ముళ్లు సామ్యా నాయక్, తిప్పా నాయక్ కూడా ఇందుకు సహకరిస్తున్నట్లు సమాచారం

నిబంధనల ఉల్లం'ఘనుడే'

- మట్కా, గ్యాంబ్లింగ్, పేకాట, క్రికెట్ బెట్టింగ్ ఆడించడంలో శ్రీరామ్‌నాయక్ దిట్ట. ఇప్పటికే చాలాసార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ తర్వాత మామూళ్లు ఇస్తూ.. తండా పరిధిలో 30 దుకాణాలు నిర్వహిస్తూ.. కర్ణాటక మద్యం విపరీతంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. శ్రీరామ్‌నాయక్ సోదరుడు గోవింద నాయక్ భార్య తండాకు మొత్తం మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. బస్టాండు సమీపంలో మంచి నీళ్ల ట్యాంక్‌ను కడితే.. ఇంటి వాస్తు కోసం దాన్ని పడగొట్టి. ప్రహరీ లోపలకు వేసుకున్నాడు.
- తన బంధువు ఒకరు ముంబయిలో కలెక్టర్ ఉద్యోగం చేస్తున్నాడని చెప్పి.. ధర్మవరంలో ఓ కుటుంబంతో వివాహ సంబంధం మాట్లాడాడు. అమ్మాయి తరపు వారితో ఏకంగా రూ.కోటి కట్నం తీసుకుని వివాహం చేయించాడు. అయితే తర్వాత ఆ యువకుడు కలెక్టర్ కాదని తేలగా.. ఇరు కుటుంబాలు చర్చించుకుని విడాకులకు సిద్ధమయ్యారు. కట్నంగా ఇచ్చిన రూ.కోటి సొమ్మును నెల రోజుల్లో ఇస్తానని పోలీసుల సమక్షంలో ఒప్పుకున్న శ్రీరామ్‌నాయక్ ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక స్వగ్రామానికి వచ్చి మళ్లీ దందాలు కొనసాగిస్తున్నాడు.



పెడపల్లిలో షెడ్యూల్ తెగల వారి కర్మకాండలకు కేటాయించిన భూమిని చదును చేయిస్తున్న దృశ్యం

గతంలోనూ ఫిర్యాదులు

- పెడపల్లి తండాకు చెందిన శ్రీరామ్‌నాయక్ గతంలో ముంబయిలో లేబర్ కాంట్రాక్టరుగా ఉండేవాడు. జిల్లాకు చెందిన వారిని అక్కడికి తీసుకువెళ్లి పనిచేయించేవాడు. అయితే జీతంలో కోతలు విధిస్తున్నాడని చాలామంది వెళ్లడం మానేశారు. ఇక ముంబయిలో కొన్ని స్థలాలు ఆక్రమించి.. షెడ్లు వేసి.. వాటిని విక్రయించాడు. అక్కడ ఓ హత్య కేసులో ఇరుక్కుని ముంబయి ఖాళీ చేశాడు.
- పెడపల్లి సర్పంచ్‌గా శ్రీరామ్‌నాయక్ (2006 – 2013) పని చేశారు. ఆ సమయంలో విద్యుత్ ఏఈగా పని చేస్తున్న మహిళపై భౌతికదాడి చేయగా కేసు నమోదు చేశారు.
- గ్రేటర్ ముంబయి కార్పొరేషన్ నుంచి తన పిల్లలకు తప్పుడు జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని వచ్చి.. 2014 ఎన్నికల్లో తన భార్య లక్ష్మీబాయిని జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో దింపాలని ప్రయత్నించాడు. అధికారులు నామినేషన్‌ను రద్దు చేశారు.
- మంగీబాయి, హేమ్లీబాయి, శ్రీనివాసనాయక్‌కు చెందిన ప్లాట్ల పత్రాలను ట్యాంపరింగ్ చేసి గొర్రెల కాపరి వెంకటరామ నాయక్‌కు విక్రయించాడు. అయితే స్థలం మాత్రం స్వాధీనం చేయలేదు.. తర్వాత ఆయన డిమాండ్ చేసినప్పటికీ డబ్బులు తిరిగి ఇవ్వలేదు. అదంతా ప్రభుత్వ భూమి కావడంతో ఆ కేసులో శ్రీరామ్ నాయక్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

మా టైమూ వస్తుంది... జాగ్రత్త !

- ధర్మవరంలో అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడటం అన్యాయం
- బాధితులపైనే హత్యాయత్నం కేసులు పెట్టడం దుర్మార్గం
- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం.. కాపాడుకుంటాం
- అరాచకాలు ఆపకపోతే జగనన్న నేతృత్వంలో ధర్నా చేస్తాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఈరలక్కప్ప

ధర్మవరం: ''ఇప్పుడు అధికారంలో ఉన్నారని విర్రవీగుతున్నారు. ఎవరి అండో చూసుకుని వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. అధికారం శాశ్వతం కాదని గుర్తించండి.. త్వరలోనే మా టైం వస్తుంది..మీకు అండగా నిలిచిన వ్యక్తి పెట్టేబేడా సర్దుకుని వెళ్లిపోతాడు. అప్పుడు మీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోండి'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉష శ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆ పార్టీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప కూటమి నేతలను హెచ్చరించారు. ధర్మవరం సబ్‌జైల్‌లో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పరామర్శించేందుకు రెండు రోజుల క్రితం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వెళ్లిన సమయంలో జరిగిన గొడవలో గాయపడిన కార్యకర్తలను బుధవారం ఉషశ్రీచరణ్, ఈరలక్కప్పలు పరామర్శించారు. అనంతరం కేతిరెడ్డిని కలిసి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడారు. ధర్మవరంలో సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలతో ములాఖత్‌కు కేతిరెడ్డి వెళ్లిన సందర్భంలో వాహనం ముందుకు తీయమన్నందుకు కేతిరెడ్డి డ్రైవర్ రామాంజిపై బీజేపీతో పాటు కూటమి పార్టీల నాయకులు దాడి చేసి వాహనాన్ని చుట్టుముట్టారన్నారు. ఆ సమయంలో డ్రైవర్ రామాంజి ప్రాణభయంతో వాహనాన్ని ముందుకు తీసుకువెళ్లారన్నారు. ఈ ఘటనలో దాడి చేసిన వారిని వదిలిపెట్టి బాధితుడైన రామాంజిపై హత్యాయత్నం కేసు పెట్టి రిమాండ్‌కు పంపేందుకు పోలీసులు సిద్ధమవ్వడం దారుణమన్నారు. దీనిపై తాము జిల్లా ఎస్పీతో మాట్లాడామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే పోలీసులు ఇలా ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఎవ్వరూ అధైర్య పడవద్దన్నారు. అలాగే గొడవ దృశ్యాలను చిత్రీకరిస్తున్న సాక్షిటీవీ విలేకరి రమేష్‌పై బీజేపీ నాయకులు దాడి చేయడం దారుణమైన విషయమన్నారు. కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాల రాస్తోందని మండిపడ్డారు. ఇందుకు తగిన మూల్యాన్ని చెల్లించుకోక తప్పదన్నారు.

ప్రజల్ని భయపెట్టేందుకే..

ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసేందుకే కూటమి నేతలు పక్కా ప్లాన్ ప్రకారమే ధర్మవరం సబ్‌జైల్ వద్ద తన డ్రైవర్‌పై అకారణంగా దాడి చేసి గొడవకు దిగారని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. ధర్మవరంలో దందాలు చేసేందుకు కూటమి నాయకులు ఒకరికొకరు పోటీ పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సైతం నేరాలను ప్రోత్సహించే విధంగా పోలీసులను ఉసిగొల్పుతోందన్నారు. సబ్‌జైల్ ప్రాంగణం, పట్టణ పోలీస్‌స్టేషన్ ఒకే కాంపౌండ్‌లో ఉన్నప్పటికీ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదన్నారు. వేరే ప్రాంతాల నుంచి గూండాలను తెచ్చి ధర్మవరంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. తన డ్రైవర్‌పై దాడి చేసి పైపెచ్చు అతడిపైనే హత్యాయత్నం కేసు బనాయించడం పోలీసుల ఏకపక్ష ధోరణికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి నాయకుల దౌర్జన్యాలను ఆపకపోతే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను ధర్మవరం పిలిపించి ధర్నా చేసి తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, సోమందేపల్లి జెడ్పీటీసీ అశోక్, పెనుకొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నందిని జయారెడ్డి, నాయకులు గంపల రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త మంజునాథ్‌కు అరుదైన గుర్తింపు

- స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ విడుదల చేసిన వరల్డ్ శాస్త్రవేత్తల జాబితాలో రొళ్ల వాసికి చోటు



డాక్టర్ కె.మంజునాథ్


రొళ్ల: అంతర్జాతీయంగా పేరుగాంచిన శాస్త్రవేత్తల సరసన రొళ్ల మండలం అగ్రహారానికి చెందిన డాక్టర్ మంజునాథ్ చోటు దక్కించుకున్నారు. ఇటీవల అమెరికాకు చెందిన స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రపంచంలోని గొప్ప శాస్త్రవేత్తల జాబితాలో డాక్టర్ కె. మంజునాథ్ కూడా ఉన్నారు. రొళ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన నిరుపేద రైతు భీరమ్మ, కృష్ణప్ప దంపతుల కుమారుడైన డాక్టర్ మంజునాథ్ ఎమ్మెస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత బెంగళూరులోని జైన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ సంస్థలో సీనియర్ పోస్టు డాక్టోరల్ విద్యార్థిగా చేరి ఎన్నో పరిశోధనలు చేశారు. ఇస్రోలోనూ పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా పరిశోధన చేశారు. ప్రస్తుతం బెంగళూరులోని నిట్టే మీనాక్షి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీనియర్ గ్రేడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నానో సైన్స్, నానో టెక్నాలజీలో మంజునాథ్ చేసిన పరిశోధనలను గుర్తిస్తూ స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం వరల్డ్ టాప్ 2 పర్సెంటేజ్ శాస్త్రవేత్తల జాబితాలో చేర్చింది.



వైఎస్సార్‌సీపీ నేత శివారెడ్డి హత్య కేసులో శిక్ష పడిన ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

జిల్లాలో కరువు ఎలా ఉండేదో.. ఒకప్పుడు ఫ్యాక్షన్ కూడా అంతే తీవ్రంగా ఉండేది. కత్తులు వేటాడి వందలాది కుత్తుకలను బలిగొన్నాయి ఇక్కడ. మరీ ముఖ్యంగా 'రాప్తాడు రక్తచరిత్ర' ఇప్పటికీ చాలామందికి గుర్తుంది. తాజాగా రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత శివారెడ్డి హత్యకేసులో ముద్దాయిలకు జిల్లా చరిత్రలోనే ఎప్పుడూ ఎవరికీ పడని విధంగా 'రెండు జీవిత కాలాల' శిక్ష పడటంతో రాప్తాడు పేరు మళ్లీ తెరమీదకొచ్చింది. రాప్తాడులో జరిగిన హత్యారాజకీయాలపై ఏకంగా సినిమాలు తీశారంటే ఈ నియోజకవర్గ ప్రభావం ఎలా ఉండేదో అంచనా వేయొచ్చు.

పరిటాల స్వార్థం.. కక్షలకు ఆజ్యం



- టీడీపీ హయామంతా రాప్తాడులో నరమేధం
- పలు కేసుల్లో బాధిత కుటుంబాలకు తీవ్రస్థాయిలో బెదిరింపులు
- సాక్ష్యాలు లేకుండా చేయడంతో కనీస విచారణకు నోచుకోని కేసులెన్నో..
- వైఎస్సార్‌సీపీ నేత కందుకూరు శివారెడ్డి హత్య కేసు ముద్దాయిలకు 'రెండు జీవిత కాలాల' శిక్ష ఖరారు
- ముద్దాయిలకు పూర్తిస్థాయిలో అండగా నిలిచిన పరిటాల కుటుంబం!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు నియోజకవర్గం పేరెత్తితే ఫ్యాక్షన్ గుర్తుకొస్తుంది. నిత్యం తుపాకీల మోతలు, బాంబు పేలుళ్లు, కత్తుల దాడులతో ఒకప్పుడు అట్టుడికింది. దీనికితోడు రీ ఆర్గనైజింగ్ కమిటీ (ఆర్‌ఓసీ) పేరుతో కేవలం ఓ వర్గం వారినే లక్ష్యంగా చేసుకుని నరమేధం సాగించారు. ఈ ఆర్‌ఓసీ మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కనుసన్నల్లో పని చేసిందనేది జగమెరిగిన సత్యం. ఆర్‌ఓసీ చేతుల్లో వందలాదిమంది ప్రాణాలు వదిలారు. కొంతమంది శవాలు కూడా కనిపించలేదు. చనిపోయిన వారికి గుర్తుగా సమాధులు నిర్మించుకునే అవకాశమూ ఇవ్వలేదు. చాలా కేసుల్లో బాధిత కుటుంబాలు సాక్ష్యం చెప్పలేక కనీసం విచారణకు కూడా రాలేదంటే వారిని ఏ స్థాయిలో బెదిరించారో అర్థం చేసుకోవచ్చు. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన సౌమ్యుడు, వివాదరహితుడు అయిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డిని ఆధిపత్యం కోసం పొట్టన పెట్టుకున్నారు. నిందితులకు పరిటాల కుటుంబం పూర్తి సహాయ సహకారాలు అందించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో నేరం రుజువైన తర్వాత ముద్దాయిలకు 'రెండు జీవిత కాలాల' శిక్ష పడడంతో రాప్తాడు రక్త చరిత్ర రాష్ట్రంలో మరోమారు చర్చకు వచ్చింది. అలాగే తగరకుంట కొండారెడ్డి హత్య కేసు విచారణ పూర్తయిన తర్వాత కూడా సాక్షులను బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులోని నిందితులకూ పరిటాల కుటుంబం వెన్నుదన్నుగా నిలిచినట్లు విమర్శలున్నాయి.

టీడీపీ హయాంలో నరమేధం

రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హయామంతా పరిటాల కుటుంబం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ వచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత పరిటాల సునీత మంత్రి అయ్యారు. గ్రామాల్లో తమకు ఎదురు తిరిగిన వారిని టీడీపీ శ్రేణులు మట్టుబెట్టాయి. ఈ క్రమంలోనే 2015 ఏప్రిల్ 29న పట్టపగలే రాప్తాడులో పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ప్రసాద్‌రెడ్డిని టీడీపీ నేతలు హత్య చేశారు. 2018 మార్చి 30న అనంతపురం రూరల్ మండలం కందుకూరులో శివారెడ్డిని అతి దారుణంగా హత్య చేశారు. అదే ఏడాది అక్టోబరు 10న ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నేత గూలి కేశవరెడ్డిని హత్య చేశారు. ఈ ఘటనలతో నియోజకవర్గమంతా ఉలిక్కిపడింది. చాలా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు రాప్తాడు నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత ఫ్యాక్షన్‌పై ఉక్కుపాదం మోపారు.

మళ్లీ పురుడు పోసుకుంటున్న ఫ్యాక్షన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ మళ్లీ పురుడు పోసుకుంటోందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలం రామగిరి పరిధిలోని కుంటిమద్దిలో టీడీపీ కార్యకర్త నాటు తుపాకీతో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేశవ్‌పై దాడి చేయబోయాడు. అప్రమత్తమైన బాధిత కుటుంబ సభ్యులు తిరగబడడంతో పెను ప్రమాదం తప్పింది. అదే మండలంలో వైఎస్సార్‌సీపీ నేత ముత్యాలు ఇంటిపై రాళ్లతో దాడులు చేశారు. వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

హంతకులకు పరిటాల కుటుంబం అండ



గ్రామాల్లో హత్యా రాజకీయాలను ప్రోత్సహించి పబ్బం గడుపుకోవడం పరిటాల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. చాలా హత్య కేసుల్లో నిందితులకు పరిటాల కుటుంబం దన్నుగా నిలిచింది. ఆ ధైర్యంతోనే నిందితులు బాధిత కుటుంబ సభ్యులను సాక్ష్యాలు చెప్పకుండా బెదిరింపులకు గురి చేశారు. ఈకారణంగా చాలా కేసులు వీగిపోయాయి. కందుకూరు శివారెడ్డి కేసులో బాధిత కుటుంబ సభ్యులు ఎన్ని బెదిరింపులు వచ్చినా ధైర్యంగా నిలబడ్డారు. ఈ కేసులో నిందితులకు పరిటాల సునీత సొంతూరులో ఆశ్రయం కల్పించారు. అప్పట్లో బాధితుల పక్షాన నిలిచిన నాపై కూడా కేసులు బనాయించారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత కుటుంబాలు ధైర్యంగా నిలబడితే శివారెడ్డి కేసులాగానే కచ్చితంగా న్యాయం జరుగుతుంది. బాధిత కుటుంబాలకు మేము అండగా ఉంటాం.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

క్లుప్తంగా

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకుడు



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రామ్‌కమల్

బత్తలపల్లి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల (రేగాటిపల్లి)ను విద్యార్థుల ప్రత్యేక అవసరాలు గుర్తించే రాష్ట్ర పరిశీలకుడు రామ్‌కమల్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ధర్మవరం ఎంఈఓ గోపాల్‌నాయక్, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ ఆనందబాబు ఉన్నారు. పాఠశాల వాతావరణం, పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత చూసిన ఆయన ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. వైకల్యంతో బాధపడుతున్న 9వ తరగతి విద్యార్థి నవీన్‌కుమార్‌రెడ్డితో మాట్లాడారు. తనకు కంప్యూటర్ రంగమంటే ఇష్టమని విద్యార్థి తెలపడంతో ఇందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న లారీ

బత్తలపల్లి: ముదిగుబ్బ మండలం పెద్దచిగుళ్లరేవు సమీపంలోని చిత్రావతి నది నుంచి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని (16 వీల్స్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... బుధవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు స్థానిక ఆర్టీటీ ఆస్పత్రి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీని అడ్డుకుని పరిశీలించారు. అందులో తరలిస్తున్న ఇసుకకు సంబంధించి ఎలాంటి ఆధారాలను డ్రైవర్ అశోక్‌కుమార్ చూపకపోవడంతో లారీని సీజ్ చేసి, 22 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇసుక అక్రమ తరలింపులో కూటమి నేతల హస్తమున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు సమాచారం.

ఇసుక టిప్పరు, లారీ పట్టివేత

రాప్తాడు రూరల్: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి బుధవారం ఉదయం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్, లారీని మన్నీల క్రాస్ వద్ద ఇటుకులపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బత్తలపల్లి మండలం కట్టకిందపల్లికి చెందిన విశ్వనాథనాయుడు ఇసుకను అక్రమంగా తరలించి ఓ చోట డంప్ చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి వాహనాల్లో అనంతపురానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో వాహనాలను సీజ్ చేసి, అక్రమ తరలింపుదారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ హేమంత్‌కుమార్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మహిళ మృతి

కదిరి అర్బన్: మండలంలోని దేవర చెరువులో బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని మహిళ (60) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కదిరి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించి, ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు జిల్లా జట్టు

హిందూపురం టౌన్: ఎన్టీఆర్ జిల్లా కానూరులో జరుగుతున్న సీనియర్ మహిళల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు సెమీస్‌కు చేరుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ గోదావరి మీద 1-0 గోల్స్ తేడాతో గెలిచి సెమీ ఫైనల్స్‌కు చేరినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. సెమీ ఫైనల్‌లో గురువారం కర్నూలు జిల్లా జట్టుతో జిల్లా జట్టు తలపడనుందన్నారు.

సైబర్.. పరేషాన్

- రోజురోజుకూ పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- రూ.లక్షల్లో నష్టపోతున్న సామాన్యులు



హిందూపురం అర్బన్: కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్ల పాలిట వరమైంది. అదే సమయంలో సామాన్యులకు శాపంగా మారింది. పోలీసులు ఎన్ని సదస్సులు పెట్టి సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన... అవతలి వ్యక్తి బెదిరింపులకు బెంబేలెత్తిన సామాన్య ప్రజలు.. రూ.లక్షల్లో నష్టపోతున్నారు. పెరిగిన నగదు రహిత లావాదేవీల్లో లొసుగులను ఆసరాగా చేసుకుని కష్టజీవులను దోచుకునేలా సైబర్ నేరగాళ్లు ఉచ్చు విసురుతూనే ఉన్నారు. ఉద్యోగాల పేరట నిరుద్యోగులకు, ఆన్‌లైన్ గేమ్స్ పేరట యువతను సైబర్ నేరగాళ్లు బోల్తా కొట్టిస్తున్నారు.

మచ్చుకు కొన్ని...

- హిందూపురంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ.. సామాజిక మాధ్యమాల్లో రీళ్లు చేస్తూ అప్‌లోడు చేస్తూ పలువురిని ఆకట్టుకుంది. ఈ క్రమంలో ఆమె ఆసక్తిని సైబర్ నేరగాళ్లు తెలివిగా సొమ్ము చేసుకున్నారు. మొదట ఆమెకు ఓ లింక్ పంపి, దాని ద్వారా రీళ్లు అప్‌లోడ్ చేస్తే నగదు పారితోషకం అందుతుందని సూచించారు. దీంతో ఆమె కొన్ని రీళ్లు చేసి ఆ లింక్ ద్వారా అప్‌లోడ్ చేసింది. ఆ సమయంలో నగదు బదిలీకి సంబంధించి బ్యాంక్ వివరాలను సైబర్ నేరగాళ్లు ఆమెతోనే రాబట్టుకున్నారు. అనంతరం కొంత మొత్తం చొప్పున ఆమె ఖాతాలో జమ చేస్తూ వచ్చారు. కొన్ని రోజుల తర్వాత ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.23లక్షలు మాయమయ్యాయి. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి లబోదిబో మంటూ వాపోయింది.
- హిందూపురంలోని ముక్కిడి పేటలో ఉన్న నజీర్ (పేరుమార్చాం) నిరుద్యోగి. ఉద్యోగం కోసం సోషియల్ మీడియాలో వెదుకుతూ ఉంటాడు. ఈ క్రమంలో జీఎస్‌ఎల్ అనే కంపెనీ తరఫున ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయవచ్చునని సందేశం అందింది. దీంతో ఆసక్తితో నజీర్ మరింత సమాచారం కోసం సంప్రదించాడు. బెంగళూరు కేంద్రంగా సదరు కంపెనీ పనిచేస్తోందని, ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉంటే తాము పంపే లింక్‌కు తొలుత రూ.750 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతో వారు తెలిపినట్లుగానే ఫోన్‌పే ద్వారా రూ.750ను నజీర్ చెల్లించాడు. ఐదు రోజుల తర్వాత ఉద్యోగానికి ఎంపికయ్యావని ఐడీ కార్డు, ఇతర వాటికి రూ.1,200 పంపాలన్నారు. ఆ మొత్తాన్ని కూడా పంపిన తర్వాత మరొక అంశాన్ని లేవనెత్తి మరి కొంత డబ్బు లాగారు. ఇలా విడతల వారీగా రూ.8వేలకు పైగా వసూలు చేసిన తర్వాత వారి వాట్సాప్ పనిచేయకుండా పోయింది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు... ఈ విషయం పది మందికి తెలిస్తే పరువు పోతుందని మిన్నకుండిపోయాడు.
- ఈ ఏడాది ఆగస్టు 12న హిందూపురానికి చెందిన ఓ వ్యాపారికి ముంబయి నుంచి కాల్ వచ్చింది. బుక్ చేసిన సరుకు దుబాయి నుంచి ముంబయి ఎయిర్‌పోర్టుకు వచ్చిందని, దానిని కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారని అవతలి వ్యక్తి తెలిపాడు. అయితే తాను ఎలాంటి సరుకు బుక్ చేయలేదని సదరు వ్యాపారి చెపుతుండగానే అవతలి వ్యక్తి అడ్డుకుని వ్యాపారి ఆధార్ నంబర్, అడ్రస్ తెలిపి బెదిరింపులకు దిగడంతో వెంటనే ఫోన్ కట్ చేశాడు. మరుసటి రోజు మళ్లీ ఫోన్ కాల్ వచ్చింది. తాను ముంబయి కస్టమ్స్ అధికారి మాట్లాడుతున్నానని అవతలి వ్యక్తి తెలిపి పార్శిల్ విషయంగా మరింత భయపెట్టాడు. దీంతో వెంటనే బెంగళూరులో ఉన్నత శ్రేణి ఉద్యోగంలో ఉన్న తన బంధువు దృష్టికి ఈ విషయాన్ని వ్యాపారి తీసుకెళ్లాడు. ఆయన అది ఫేక్ కాల్‌గా నిర్ధారించుకుని బాధిత వ్యాపారికి తెలిపి ధైర్యం చెప్పాడు.

మోసాలకు వేదికలు ఇవే...

తమకు తెలియని సమాచారం కోసం గూగుల్ సెర్చ్‌కు వెళ్లి వివిధ లింక్‌లను యువత క్లిక్ చేస్తూ అనవసరమైన విషయాన్ని రాబట్టుకోవడం అలవాటుగా మార్చుకుంది. ఇలా క్లిక్ చేస్తున్న లింక్‌లపై నిఘా ఉంచిన సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా యువతను తమ ఉచ్చులోకి లాగేసుకుంటున్నారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా మోసాలకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో హనీట్రాప్ మరో అడుగు ముందుకేసింది. అందమైన అమ్మాయిల పేరుతో ఫేక్ అకౌంట్లను సృష్టించి కస్టమర్ కేర్, ఫ్రాడ్ ఓటీపీలతో మోసాలకు తెగబడుతున్నారు.

సురక్షిత లావాదేవీలు చేయడమే ఉత్తమం..

డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో సురక్షిత లావాదేవీల నిర్వహణపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

- ఆన్‌లైన్‌లో డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు బార్‌కోడ్, క్యూర్‌కోడ్‌ల స్కానింగ్ చేయక పోవడం ఉత్తమం.
- బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి ఐడీ, పాస్‌వర్డ్, యూపీఐపిన్, ఓటీపీ, ఏటీఎం, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డుల వివరాలు ఎవరికీ తెలియనివ్వరాదు.
- ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌నే ఉపయోగించాలి.
- పొరపాటున ఫోన్‌పే, గూగుల్ పే ఖాతాల్లో డబ్బు వేశామని, వాటిని వెనక్కు పంపండని ఎవరైనా కాల్ చేస్తే అదే నంబర్ నుంచి డబ్బు పంపరాదు.
- ఫోన్ కాల్, ఈ మెయిల్ చేసి కేవైసీ అప్‌డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పరాదు. అనుమానం ఉంటే బ్యాంక్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పరిశీలించుకోవాలి. లేదా బ్యాంక్ అధికారులను సంప్రదించాలి.
- గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకుతున్నప్పుడు నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి. వీటి అంశంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.
- ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్స్ పేరట బ్లాక్ మెయిల్ చేసి నేరాలకు పాల్పడేవారు ఎక్కువయ్యారు. సోషల్ మీడియా ద్వారా ట్రాప్ చేయడానికి గిఫ్ట్ కూపన్లు కూడా పంపిస్తుంటారు. డేటింగ్ సైట్లు, డేటింగ్ యాప్స్‌పై జాగ్రత్త అవసరం.

లింక్‌లు ఓపెన్ చేయొద్దు

జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకులకు సంబంధించిన బ్రాంచీలు 223, వాటికి అనుబంధంగా ఏటీఎంలున్నాయి. క్రెడిట్ కార్డులని, ఇతర లోన్లు ఇస్తామంటూ కొందరు లింక్‌లు పంపుతుంటారు. ఇలాంటి వాటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయరాదు. సైబర్ నేరాలకు మోసపోతే వెంటనే సమీప బ్రాంచ్‌తో పాటు సైబర్ క్రైమ్ పోలీసులకూ ఫిర్యాదు చేయాలి.

– రమణకుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్.

కేతిరెడ్డిపై దాడి యత్నం దుర్మార్గం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై టీడీపీ, బీజేపీ నాయకులు దాడికి యత్నించడంతో పాటు అక్రమంగా కేసులు బనాయించడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరంలో అక్రమ కేసులు బనాయించి సబ్ జైలుకు తరలించిన వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై టీడీపీ, బీజేపీ నాయకులు కాపుకాచి దాడికి యత్నించడం బాధాకరమన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ దారుణం జరిగిందన్నారు. రాజకీయ విద్వేషాలకు హింసా మార్గాన్ని ఎంచుకోవడం సబబు కాదని హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే ప్రభుత్వంపై ప్రజలే తిరగబడుతారని హెచ్చరించారు.

పాత్రికేయుడిపై దాడి ఘటనలో బాధ్యులపై చర్యలకు డిమాండ్



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

పుట్టపర్తి టౌన్: ధర్మవరంలో సాక్షి టీవీ విలేకరి రమేష్‌పై దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ రత్నను జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్పీని ఆమె కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న పాత్రికేయులపై ఇటీవల దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తిలో భాగంగానే పాత్రికేయులు పనిచేస్తున్నారని, అయితే వారిని పార్టీల పరంగా విభజించి చూడడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి... వీడియో క్లిప్పింగ్‌ల ఆధారంగా దోషులపై కేసు నమోదు చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బాబు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, గణేష్, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ దివిటి రాజేష్, పాత్రికేయులు పాల్గొన్నారు

‘రింగ్’ పడింది...

బత్తలపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన రింగు రోడ్డు





అనంతపురం–కదిరి మార్గంలోని బత్తలపల్లి వద్ద రింగ్ రోడ్డు ప్రారంభమైంది. గతంలో కదిరికి వెళ్లాలంటే బత్తలపల్లి మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకునేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బత్తలపల్లి వద్ద రింగ్ రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు పూర్తి కావడంతో బుధవారం ఆ మార్గంలో వాహనాలు దూసుకెళుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

జ్వర పీడితులకు ఇంటి వద్దనే వైద్యం



జ్వర పీడితుల వివరాలు సేకరిస్తున్న డాక్టర్ కుళ్లాయప్పనాయక్

బత్తలపల్లి: స్థానిక వినాయక్ నగర్‌లో జ్వరాలతో బాధపడుతున్న వారికి ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు అందించినట్లు జిల్లా మలేరియా అధికారి కేసీ కుళ్లాయప్ప నాయక్, జిల్లా అదనపు మలేరియా అధికారి ఆర్.లక్ష్మానాయక్ తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలసి బుధవారం వారు వినాయక్ నగర్‌లో పర్యటించారు. డెంగీ, ఇతర విష జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్సలు అందజేశారు. ఇంటింటికీ తిరిగి దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. జ్వర పీడితులను గుర్తించేందుకు కాలనీలోని దాదాపు 15 ఇళ్లను సర్వే చేయించారు. జ్వరాలు సోకగానే వెంటనే ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు డాక్టర్ కేసీ కుళ్లాయప్ప నాయక్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు గంగిరెడ్డి, సీహెచ్‌ఓ రాజశేఖర్, ఆరోగ్య సిబ్బంది తిరుపాల్‌నాయక్, మారుతి, ఏఎన్‌ఎం కవిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి

అగళి: మండలంలోని కరిదాసనపల్లి గొల్లహట్టి గ్రామంలో గొర్రెల మందపై ఓ చిరుత దాడి చేసింది. గ్రామానికి చెందిన కాపరి ఉగ్రప్ప మంగళవారం తన గొర్రెలను మేపునకు తోలుకుని వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మందపై దాడి చేసిన చిరుత ఓ గొర్రెను లాక్కెళ్లి తినేసింది. కాగా, ఈ నెల 9న అదే గ్రామ నివాసి కాపరి మంజునాథ్‌కు చెందిన రెండు గొర్రెలను చిరుత లాక్కెళ్లి తినేసింది. రావుడి పెద్దబండ ప్రాంతంలో ఓ చిరుత, మూడు పిల్లలు సంచరిస్తున్నాయని రైతులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి చిరుత, దాని పిల్లలను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి

- ఎస్పీ రత్న



పోలీస్ అధికారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలో నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని సిబ్బందిని ఎస్పీ రత్న ఆదేశించారు. నెలవారీ నేర సమీక్ష సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జరిగింది. కదిరి, పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల వివరాలు, దర్యాప్తుల పురోగతిపై ఆరా తీశారు. కేసుల ఛేదింపులో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామ సందర్శన, పల్లె నిద్ర కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, కదిరి, పుట్టపర్తి సబ్ డివిజన్ల డీఎస్పీలు శ్రీనివాసరావు, శివనారాయణస్వామి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌కే నర్సింగ్ హోమ్‌కు షోకాజ్ నోటీసుల జారీ



ఆర్‌కే నర్సింగ్ హోమ్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

హిందూపురం టౌన్: మాతాశిశు మరణాలను నివారించడంలో భాగంగా పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పక్కాగా అమలు పరుస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. బుధవారం హిందూపురంలోని ఆర్‌కే నర్సింగ్ హోమ్‌ను ఆమె తనిఖీ చేశారు.రికార్డుల నిర్వహణలో లోపాలను గుర్తించి నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మరోసారి తనిఖీకి వచ్చినప్పుడు నిర్వహణలో లోపాలు గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్నేహ డయాగ్నస్టిక్స్ ల్యాబ్‌ను పరిశీలించి, అనుమతులు లేకపోవడంతో నిర్వాహకుడికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పరిసర పీహెచ్‌సీ వైద్యులతో ఆమె సమావేశమై మాట్లాడారు. గర్భిణులు, తల్లీబిడ్డలకు అందించే సేవల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పద్మజ, జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫక్రుద్దీన్, వైద్యాధికారులు షఫీ, సుల్తానా, నవీన్‌కుమార్, విజయ్‌కుమార్, కిరణ్మయి, మంజుశ్రీ., సిబ్బంది ముస్తఫా, రమేష్ పాల్గొన్నారు.

కంటైనర్‌లో మంటలు



కంటైనర్‌లో ఎగిసిపడుతున్న మంటలు

పెనుకొండ: స్థానిక పులేకమ్మ గుడి వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఓ కంటైనర్‌లో మంటలు ఎగిసి పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి మల్లికార్జున రెడ్డి... సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. తమిళనాడు నుంచి ఢిల్లీకి కంటైనర్‌లో పాత బ్యాటరీలు, సీడీలు, కంప్యూటర్ పరికరాలను డ్రైవర్ కమ్రుద్దీన్ తీసుకెళుతుండగా పులేకమ్మ గుడి వద్ద ఉన్నఫళంగా మంటలు చెలరేగాయి. ప్రమాదంలో రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

పర్యాటక దినోత్సవం వేదిక మార్పు

ప్రశాంతి నిలయం: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన లేపాక్షిలో ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించాలని తొలుత నిర్ణయించినా, వాతావరణ మార్పుల కారణంగా పుట్టపర్తిలోని సాయి ఆరామానికి మార్పు చేశారు. ఈ మేరకు కలెక్టర్ టీస్ చేతన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం 5 గంటలకు తోలుబొమ్మలాట, వివిధ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయి.


విష జ్వరంలో చిన్నారి మృతి



అలియా(ఫైల్)

గుడిబండ: విష జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. వివరాల మేరకు... గుడిబండకు చెందిన జిక్రియా కుమార్తె అలియా (9) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఇటీవల జ్వరం రావడంతో కుటుంబీకులు స్థానిక ఆస్పత్రుల్లో చూపించారు. నయం కాకపోవడంతో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక బుధవారం మృతి చెందింది. విష జ్వరంతోనే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు జిక్రియా తెలిపారు.

శిశువుల మృతిపై విచారణ



విచారణ చేపడుతున్న డాక్టర్ స్వప్న సింధు

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆగస్టులో చోటుచేసుకున్న ముగ్గురు శిశువుల మృతిపై విచారణ ముమ్మరమైంది. ఆయా ఘటనలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇందుకోసం తాడేపల్లిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (గైనకాలజీ) డాక్టర్ స్వప్న సింధును విచారణాధికారిగా నియమించడంతో బుధవారం ఆమె ఆస్పత్రికి వచ్చి విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, బాధితులను వేర్వేరుగా బుధవారం రాత్రి వరకు విచారణ చేపట్టారు. వాస్తవానికి ఈ నెల 28న విచారణ జరగాల్సి ఉండగా, ఉన్నతాధికారుల సూచన మేరకు 25వ తేదీనే విచారణ చేపట్టారు. రికార్డులనూ పరిశీలించి బాధితులతో మాట్లాడారు. లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన బాధితురాలి తరఫున ఆమె బంధువులు విచారణకు హాజరై లిఖితపూర్వకంగా వివరాలు వెల్లడించారు. కాగా శిశువుల మృతిపై విచారణ చేపట్టేందుకు వచ్చిన విచారణాధికారికి మరిన్ని విషయాలు గుర్తించినట్లు తెలుస్తోంది. గైనకాలజీ విభాగంలో ప్రసవాల కోసం డబ్బు వసూలు, కొందరు వైద్యులు ఆస్పత్రికి వచ్చే కేసులను తమ సొంత క్లినిక్‌లకు రెఫర్ చేస్తున్న విషయాలను బాధితులు విచారణాధికారి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. శిశువుల మృతి ఘటనలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలకు సిఫారసు చేయాలని బాధితులు కోరినట్లు సమాచారం.